క్లుప్తంగా

23న గో ఆధారిత వ్యవసాయంపై సదస్సు

చింతపల్లి: మండల కేంద్రంలోని సాయి సన్నిధి దేవాలయంలో రైతులకు ఈ నెల 23న గో ఆధారిత వ్యవసాయ విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సాయి సన్నిధి చైర్మన్ మంచికంటి ధనుంజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న సాయి దేవాలయ ఆవరణలో 'గో ఆధారిత వ్యవసాయం చేద్దాం, భూ మాతను, గో మాతను రక్షించుకుందాం' అనే అంశం పై అవగహన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ పర్యావరణ వేత్త, ప్రకృతి ప్రేమికులు, సాంప్రదాయ వ్యవసాయ విధానంపై సమగ్ర అవగాహన కలిగిన సుభాష్ పాలేకర్ హాజరై అవ గాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కావున మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు.

ధర్తి ఆబా అభియాన్‌కు ఐదు గ్రామాలు ఎంపిక

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలంలో ధర్తి ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌కు ఐదు గ్రామాలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అభియాన్ అబ్జర్వర్, హాస్టల్ వార్డెన్ బైరబోయిన లక్ష్మణ్ మాట్లాడుతూ అడవిదేవులపల్లి మండలంలో ఆ అభియాన్ కింద మొల్కచర్ల, బంగారుకుంట తండా, చింతచెట్టుతండా, బాల్నేపల్లి, ఉల్సాయి పాలెం గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాలను అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌జీఎస్ సిబ్బంది సంయుక్తంగా డ్యూటీలను అప్పగించినట్లు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారి వివరాలను 40లైన్లలో పొందు పరిచి ఆన్‌లైన్ అప్‌లోడ్ చేయాలని, ఈ విషయంపై జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు ఉన్నారు.

23న శంకర్‌నాయక్‌కు సన్మానం

మిర్యాలగూడ టౌన్ : ఎమ్మెల్సీగా ఎన్నికైన కేతావత్ శంకర్‌నాయక్‌కు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు పలు గిరిజన సంఘాల నేతలు ప్రకటించారు. గురువారం పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన సంఘాల నేతలు మాట్లాడుతూ పట్టణంలోని ఎస్వీ గార్డెన్‌లో ఈనెల 23న ఉదయం అద్దంకి–నార్కట్‌పల్లి బైపాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఎస్వీ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు డి. చిట్టిబాబునాయక్, ఎం. తిరుపతినాయక్, సైదులునాయక్, బాషానాయక్, రమావత్ బాలునాయక్, పాపానాయక్, బాలాజీ నాయక్, బాలునాయక్, బిక్కునాయక్, లింగానా యక్, వినోద్‌నాయక్, జవహర్‌నాయక్, శ్రీను, నాగరాజు, చంద్రునాయక్, రాంచందర్‌నాయక్, మంగ్తానాయక్‌లతో నాయకులు తదితరులున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఇవ్వొద్దు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని హనుమాన్‌పేటలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వవద్దంటూ గురువారం స్థానిక ప్రజలు మున్సిపల్, సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాలను అందజేశారు. ఒక వైపు పాఠశాలలు, మరోవైపు దేవాలయాలు ఉన్నందున అనుమతులు ఇచ్చినట్లయితే వెంటనే రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నారాయణ, కుప్పాల వెంకట సుబ్బారావు, వీరయ్య, చిలుకూరి శ్యాం, ఎండి ఆరీఫ్, గోవర్ధనాచారి, లక్ష్మణ్, హమీద్, ఉపేందర్‌రెడ్డి, నాగయ్య, నవాబ్, వెంకటయ్య, అనిత, రహీమ్, పద్మ, మట్టయ్య, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

డిండి : శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని డిండి రూరల్ సీఐ బీసన్న ప్రజలకు సూచించారు. గురువారం దేవరకొండలోని డిండి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో నేర సమాచారం తెలిస్తే తమకు అందించాలన్నారు. ఇక్కడ సీఐగా పనిచేసిన ఎస్.సురేష్ జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ కాగా అదే ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బీసన్న బదిలీపై డిండి రూరల్ సీఐగా వచ్చి భాధ్యతలు స్వీకరించారు.

సీఈసీ గ్రూప్‌ను తరలించకుండా చూడాలి

దేవరకొండ : దేవరకొండ మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే కళాశాలలో సీఈసీ గ్రూప్ తరలించకుండా చూడాలని బీసీ సంరాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను దేవరకొండకు చెందిన పలువురు బీసీ నాయకులు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ఆర్.కృష్ణయ్య నివాసంలో కలిసి ఈమేరకు విన్నవించారు. ఆ కళాశాలలో సీఈసీ గ్రూప్‌ను నార్కట్‌పల్లికి మార్చడంపై ఇక్కడి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. స్పందించిన ఆయన బీసీ గురుకులాల సెక్రటరీ సైదులుతో మాట్లాడి దేవరకొండ కళాశాలలో సీఈసీ గ్రూప్‌ను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన స్పందించి కొనసాగిస్తామని హామీఇచ్చినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

కౌలు రైతుకేదీ భరోసా?

- ప్రభుత్వం నుంచి అందని సాయం
- బ్యాంకులు సైతం కనికరించని వైనం
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు



హాలియా : ఎన్ని ప్రభుత్వాలు మారిన కౌలు రైతుల బతుకులు మాత్రం మారడం లేదు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం పట్టాదారు రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందించేది. కౌలు రైతులు భూమిని కౌలు తీసుకుని పంటలను సాగు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు వారికి ఏ మాత్రం సహాయం అందించడం లేదు. చివరికి ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం అందించే నష్ట పరిహారం కూడా పట్టాదారు రైతులకే ఇస్తుండటంతో కౌలు రైతుల బతుకులు దుర్భరం గా మారుతున్నాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కౌలు రైతులకు ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పిన మాట నీటిపై రాతల్లాగే మిగిలిపోయింది. ప్రజా ప్రభుత్వం అని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా కౌలు రైతుల ఊసే ఎత్తడం లేదు.

నియోజకవర్గంలో 3వేలకు పైగా కౌలు రైతులు

నాగార్జున సాగర్ నియోజకవర్గంలో కౌలు రైతులకు సంబంధించి అధికారిక లెక్కలు లేనప్పటికీ నియోజకవర్గ వ్యాప్తం సుమారు 3వేలకు పైగా కౌలు రైతులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లపై ఒత్తిడి తీసుకు వస్తున్నప్పటికీ, పంటలు పండక కౌలు రైతులు నష్టం చవిచూడాల్సి వస్తే రుణాల వసూళ్ల సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. దీంతో బ్యాంకర్లు కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. బ్యాంకర్లు రుణాలు ఇవ్వకపోవడంతో కౌలు రైతులు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. తీరా పంటలు పండి చేతికి వచ్చే సమయానికి పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో కౌలు రైతులు తీవ్ర నష్టాలను చవి చూడటమే కాకుండా మరి కొంతమంది కౌలు రైతులు అప్పుల తీర్చలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటల సాగుకు రుణాలను ఇప్పించి ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. కౌలు రైతులు ఒక ఎకరాకు రూ. 20వేల నుంచి రూ. 23వేలు పెట్టి మరీ కౌలు తీసుకుని పంటలను సాగు చేస్తున్నారు. కౌలు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలలో చెప్పిన విధంగా సంవత్సరానికి రూ. 15 వేలు చెల్లించాలి. ఇదే కాకుండా కౌలు రైతులకు రుణాలు ఇచ్చే విధంగా బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేయాలి. పంట నష్ట పరిహారం కూడా సాగు చేసిన వారికే వచ్చే విధంగా చూడాలి.

–ఎస్‌కె సైదావలి, రాజన్నగూడెం, నిడమనూరు మండలం

రైతు భరోసా అందించాలి



పెరిగిన పెట్టుబడి ఖర్చులతో పంటలసాగు కష్టతరంగా మారింది. గతేడాది నేను 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేయగా గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టం వాటిల్లింది. బ్యాంకులు కౌలు రైతులకు ఎలాంటి రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం పట్టాదారులకు కాకుండా క్షేత్రస్థాయిలో పంటలను సాగు చేసేవారికి రైతు భరోసా అందించి కౌలు రైతులను ఆదుకోవాలి.

–తిక్కనబోయిన నర్సయ్య, పాలెం, అనుముల మండలం

చెరువులు, కుంటలు కబ్జా కాకుండా చూడాలి

దేవరకొండ : దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో చెరువులు, కుంటలు కబ్జాకు గురికాకుండా చూడాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలో గల ఇరిగేషన్ శాఖ, ఆయా మండలాల తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలను రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో రెండు శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కుంటలు, చెరువులు సంరక్షించాలని సూచించారు. అనంతరం ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, పరిశీలన వంటి అంశాలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

ఆయిల్‌పామ్ సాగుతో రెట్టింపు ఆదాయం



తుంగతుర్తిలో ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

పెద్దవూర : తక్కువ నీటి వసతితో, తక్కువ పెట్టుబడితో ఆయిల్‌ఫాంను సాగు చేయడం వలన రైతులు రెట్టింపు ఆదాయం పొందవచ్చునని నాగార్జున సాగర్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి కె.మురళి అన్నారు. గురువారం మండలంలోని తుంగతుర్తి గ్రామంలో రైతు కత్తి జయసింహారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పాం మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయిల్ పాం సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సదుపాయాన్ని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పతంజలి జిల్లా మేనేజర్ మధుసూధన్‌రెడ్డి, బి.సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులను తనిఖీ చేయండి

మిర్యాలగూడ : పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ తనిఖీలు నిర్వహించాలని మిర్యాలగూడ ఆర్టీఓకు బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడీయ్యయాదవ్ మాట్లాడుతూ మిర్యాలగూడలో కొన్ని స్కూల్ బస్సులు ఫిట్నెస్‌కి అనుకూలంగా లేవని, కాలం చెల్లిన బస్సులను వినియోగిస్తూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, అలాంటి బస్సులను తక్షణమే సీజ్ చేయాలన్నారు. స్కూల్ బస్ ఫీజు పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకు వేల రూపాయలను వసూలు చేస్తూ ఫిట్నెస్ లేని బస్సులను వినియోగిస్తున్నారన్నారు. 60ఏళ్లు పైబడిన వారిని డ్రైవర్లుగా కొనసాగించవద్దన్నారు. అలాగే మద్యం తాగి బస్సు నడిపే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి సురేష్, పరంగి సురేష్, రవినాయక్, గాదగోని మహేష్‌గౌడ్, లక్ష్మణ్, రాము తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించనున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కురువ అన్నారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించిన అనంతరం పాఠశాలల్లో క్రీడలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్, రామ్‌రెడ్డి, నిర్మల, పార్వతి, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్, సలిమా, నిర్మల, రజిత, సరిత, పద్మ, సంధ్య, వెంకన్న, మధు, నాగమణి తదితరులున్నారు.

వేములపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందచేసి మాట్లాడారు. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపించి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధీన సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొలన్నారు.

త్రిపురారం : ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయకుమారి అన్నారు. బుధవారం మండలంలోని మాటూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్కూల్ డ్రెస్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలలో 100 మంది విద్యార్థులను చేర్పుటకు ఉపాధ్యాయులు చేసిన కృషికి అభినందించారు. ట్యూటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని, ట్యూటర్‌కు అయ్యే ఖర్చును ప్రతి నెలా అందిస్తామని, రూ. 10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం ఎంఈఓ రమావత్ రవి, ప్రదానోపాధ్యాయులు వాసు, పాండు నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



త్రిపురారం : మాటూర్ పాఠశాలకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీడీఓ

నిడమనూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన ఉంటుందని ఎంఈఓ ఎల్ వెంకన్న తెలిపారు. గురువారం జంగాలవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, టై, బెల్టులు పంపిణీ చేశారు. జంగాలవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో 67మంది విద్యార్థులు చదువుతున్నారని, పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రాగి జావా, యూనిఫాం, మధ్యాహ్నభోజనం అందిస్తున్నామని తెలిపారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం వి రాములు, పాఠశాల ఉపాధ్యాయులు రవి, ప్రతాప్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ పాఠశాలలకు దాతలు చేస్తున్న సహకారం అభినందనీయమని ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాంపల్లి గ్రామానికి చెందిన గార్లపాటి వెంకటేశ్వర్లు పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్స్ , ఇతర సామగ్రి అందజేశారు. వీటిని ఎంఈఓ శ్రీనివాస్ విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యతోనే ఉజ్వలమైన భవిష్యత్ సాధ్యమని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోనే బోధన అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఫరీద్, అమ్మ ఆదర్శపాఠశాల చైర్మన్ నాగమణి, ఉపాధ్యాయురాలు మల్లీశ్వరీ, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, ఏలియా, చంద్రయ్య, శివారెడ్డి, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి జీవితం ఆదర్శనీయం

మిర్యాలగూడ : సీపీఎం నేత కూన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జీవితం ఆదర్శనీయమని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అవంతీపురం వృద్ధాశ్రమంలో శ్రీనివాస్‌రెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. శ్రీనివాస్‌రెడ్డి గ్రామంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేసి ఎంతో మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించారన్నారు. బతికి ఉన్నంతవరకు అనేక మందికి సాయం అందించారన్నారు. అదేవిధంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేష్ మాట్లాడారు. శ్రీనివాస్‌రెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారావు, చిమట పద్మమదార్, సురేష్, బసవయ్యగౌడ్, మల్లు గౌతంరెడ్డి, దేవిరెడ్డి, అనంతరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విజయసింహారెడ్డి

దాతల సహకారం అభినందనీయం

త్రిపురారం : పేద ప్రజల వైద్య సేవలకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని త్రిపురారం మండల వైద్యాధికారి డాక్టర్ సంజయ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలకు మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన అంది శ్రీనివాస్ రూ. 26వేల సొంత నిధులతో వీల్ చైర్‌ను వైద్యసిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకయ్య,సూపర్ వైజర్ కమలమ్మ, నర్సింగ్ ఆఫీసర్ కమలమ్మ, లాబ్ టెక్నీషియన్ నలినికాంత్, పుట్ట గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రికి వీల్ చైర్ అందజేస్తున్న దాతలు

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దవూర : మండలంలోని పులిచర్ల గ్రామానికి చెందిన షేక్ సయ్యద్‌పాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం తన క్లాస్‌మెట్స్ అంతా కలిసి సేకరించిన రూ.51వేలను సయ్యద్‌పాషా కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి వెన్నంటే ఉండి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ఏఎజీ తేరా రజనీకాంత్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాధాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరుమాది పాపిరెడ్డి, గోవిందరెడ్డి, జానపాటి శివ, జిల్లెల యాదయ్య, బొడ్డుపల్లి సైదులు, అయితబోయిన సైదులు, కామిశెట్టి శ్రీనులు తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

కోతుల బెడద నివారణకు రిటైర్డ్ ఉద్యోగులు కృషి



కోతులను పట్టిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

మాడుగులపల్లి : మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామంలో కోతుల బెడదతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా రిటైర్డ్ ఉద్యోగులు స్పందించి వాటి నివారణకు కృషి చేశారు. గురువారం దీంతో గ్రామంలోని విశ్రాంత ఉద్యోగులు ఒక కమిటీగా ఏర్పడి కోతుల బెడదను నివారించేందుకు తమ సొంత ఖర్చులతో కోతులను పట్టేవారిని తీసుకొచ్చి కోతులను పట్టించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ మాట్లాడుతూ తమ గ్రామంలో కోతులు అధికంగా ఉండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, పంట పొలాలను నాశనం చేస్తున్నాయని, వీధుల్లో తిరగాలంటే భయాందోళనకు గురవుతున్నామన్నారు. గ్రామంలో ఇప్పటివరకు 150 కోతులను పట్టుకోని దూర ప్రాంతాల్లో విడిచిపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, అప్పరెడ్డి, రాంరెడ్డి, వీరారెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

పెద్దవూర : మండలంలోని పోతునూరు స్టేజీ నుంచి పులిచర్ల గ్రామం వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని గురువారం దేవరకొండ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఆ రోడ్డు నిర్మాణానికి ఆరు నెలల క్రితం రూ.189.60 లక్షల అంచనా వ్యయంతో నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేయడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. నూతన రేట్లతో రివైజ్‌డ్ టెండర్‌ను పిలిచి మరలా ప్రతిపాదనలు పంపి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి చంద్రశేఖర్, యాదగిరి, గోమయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

మోదీ పాలన దేశానికే శ్రీరామ రక్ష

డిండి : దేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన శ్రీరామ రక్ష అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలూనాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఈజే గార్డెన్‌లో నిర్వహించిన ఆ పార్టీ మండల సంకల్ప సభ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ ఏటి.కృష్ణ, మండలాధ్యక్షుడు సైదా, మాజీ సర్పంచ్ మౌనిక, మాజీ ఎంపీటీసీ ఏటి.రాధిక, జైపాల్, రమేష్,అంజి, భిక్షపతి, సాయి, కొండలు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

మిర్యాలగూడ : ఏఐసీసీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్‌లు పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో, బాలికల ఉన్నత పాఠశాలలో, బకల్‌వాడి పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. అదేవిధంగా ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

దేవరకొండ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు గురువారం దేవరకొండ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణంలోని వృద్ధాశ్ర మంలో వృద్ధులకు పండ్లు,బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకు లు ఎంఏ సిరాజ్‌ఖాన్,దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నాయకు లు ఎండి యూనూస్,పున్న వెంకటేశ్వర్లు,నజీర్, రుక్మారెడ్డి,సైదులు, శ్రీకాంత్,ప్రసాద్,ఉమేర్,మొయిన్,తదితరులున్నారు. రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం దేవరకొండ మండలం మైనంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమి నోట్‌బుక్స్ అందజేశారు.ఈ కార్యక్రమంలో కొర్ర రాంసింగ్, వెంకట్, తదితరులున్నారు.

వేములపల్లి : ఏఐసీసీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పుట్టల పెదవెంకన్నల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో రోగులకు, గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చక్కని సత్యం, నాయకులు బొంగర్ల వినోద్, దైద గిరి, చంటి, శ్రీనివాస్, సమాధానం, వెంకన్న, రవి, శ్రీను పాల్గొన్నారు.

నిడమనూరు : మండలంలోని ముప్పారం గ్రామంలో ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కేక్‌ను కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, నాయకులు కొండా శ్రీనివాస్ రెడ్డి, శివమారయ్య, చెర్క శ్రీను, మైసయ్య, శ్రీను, నరసింహ, వెంకటరమణ, సైదయ్య, శ్రీను, ప్రసాద్, గంగాధర్, పాపయ్య, చిన లింగయ్య, యాదగిరి పాల్గొన్నారు.



మిర్యాలగూడ : రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు

812 మంది పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమం ద్వారా 812మంది చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించామని సీడీపీఓ రేఖల మమత అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడేళ్లు పూర్తి అయినా బాలికలు 279మంది, బాలురు 587మంది, నాలుగేళ్లు పూర్తయిన బాలికలు 104 మంది, బాలురు 205 మందిని చేర్పించామన్నారు. ప్రస్తుతం మూడేళ్లు పూర్తి చేసుకున్న బాలికలు 568, బాలురు 653 మంది ఉండగా ప్రాజెక్టు మొత్తం 1221, నాలుగేళ్లు పూర్తి చేసుకున్న వారు 522 మంది బాలికలు, బాలురు 528 మంది మొత్తం 1050 మంది వరకు కొనసాగుతున్నారని అన్నారు. అంగన్‌వాడీ పిల్లలకు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలకు జరుగుతున్న లబ్ధిదారుల గురించి ప్రచారం చేస్తూ అంగన్‌వాడీల బలోపేతంకు కృషి చేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గుర్రంపోడు : మండలంలోని నడికూడ గ్రామంలో విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన కలకొండ యాదగిరి అనే రైతుకు చెందిన పాడి గేదె మేత మేస్తుండగా వంపులో తెగిపడిన ఎల్‌టీ లైన్ తీగ తగలడంతో గేదె షాక్‌కు గురై మృతిచెందింది. గేదెను రక్షించబోయిన రైతుకు షాక్ తగులగా ప్రాణాలతో బయటపడ్డాడు. తనకు నష్టపరిహారం చెల్లించాలని రైతు విద్యుత్ అధికారులను కోరారు.

సంక్షిప్త సమాచారం

శిలేటి వాగు ఫీడర్ ఛానల్ గట్టు పునరుద్ధరణ

గుర్రంపోడు : మండలంలోని శిలేటి వాగు నుంచి చేపూరు కొత్త చెరవు వరకు గల ఫీడర్ ఛానల్ గట్టును ఎట్టకేలకు పునరుద్ధరించారు. ఇటీవల కాల్వ గట్టును పక్క రైతులు ఆక్రమించుకొని తమ భూమి కలిపేసుకోవడంతో కొదరు రైతులు, ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.కాల్వను తిరిగి పునరుద్ధరించకపోతే కేసులు నమోదు చేస్తామని పోలీసులు గట్టిగా హెచ్చరించడంతో తిరిగి కాల్వ గట్టును పునరుద్ధరించినట్లు ఏఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని బాపూజీ నగర్‌కు చెందిన సాయిరాం పొదుపు సంఘం మొదటి లీడర్ 29నెలలుగా లోన్ డబ్బులో బ్యాంకులో జమ చేయడం లేదని ఆ సంఘం సబ్యురాలు మర్రి రత్నమాల గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ తాను డబ్బులు మొత్తం లీడర్‌కు ఇచ్చినప్పటికీ బ్యాంకు వారు తన పర్సనల్ అకౌంట్‌లో ఉన్న డబ్బులను బ్యాంకు వారు జమచేసుకున్నారు. ఈ విషయంపై బ్యాంకు వారిని అడిగితే లీడర్ డబ్బులు చెల్లించలేదని చెప్పినట్లు పేర్కొంది. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి తాను చెల్లించిన డబ్బులను బ్యాంకు అప్పు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొండమల్లేపల్లి : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు రమావత్ హిమవంత్‌కుమార్ అన్నారు. గురువారం కొండమల్లేపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ గ్రామ కమిటీ ఎన్నిక

డిండి : మండల పరిధిలోని గోనకొల్ సీపీఐ గ్రామ శాఖ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శిగా రాగం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా కాంపల్లి లవన్, ఉజ్జిని యాదమ్మ, కోశాధికారిగా కాంపల్లి శేఖరయ్యను ఎన్నుకున్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

డిండి : మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో ఉన్న ఇంజన్‌బావి స్థలంలో పంచాయతీ సిబ్బంది హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇటీవల ఆ స్థలాన్ని గ్రామకంఠంగా గుర్తించి డీఎల్‌పీఓ శంకర్ నాక్ హద్దులు పెట్టారు. సందర్భంగా బోర్డు ఉంచిన స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి జంగయ్య పేర్కొన్నారు.

పెండింగ్ రైతు భరోసాను విడుదల చేయాలి

పెద్దవూర : గత వానాకాలం, యాసంగి సీజన్‌లో పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మండలంలోని పులిచర్ల గ్రామానికి చెందిన రైతులు గురువారం ఏఓ సందీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బుడిగపాక లక్ష్మయ్య, వీరబోయిన వెంకటయ్య, వీరబోయిన వెంకటయ్య, బాలగోని ఎల్లయ్యగౌడ్, బొడ్డుపల్లి చిరంజీవి, సత్యనారాయణ, కొండల్, సత్యం పాల్గొన్నారు.

ఐకాన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ హిల్ కాలనీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఐకాన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. గుండె, మెదడు, నరాల వెన్నెముక, ఎముకలు, యూరాలజీ, గ్యాస్ట్రో తదితర రోగులకు కన్సల్టేషన్ ఉచితంగా ఉంటుందని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ట్రాన్స్‌కో, ఎస్‌పీడీసీఎల్ ఉద్యోగులకు ఆరోగ్యశ్రీ,ఈహెచ్ఎస్ సదుపాయంతో పాటు అన్ని ఇన్సూరెన్స్‌ల కార్డులు కలిగిన వారికి ఉచితంగా వైద్యసౌకర్యం ఉంటుందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దవూర : పాఠశాలల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ శోభన్‌బాబు, నాయకులు తరుణ్, నగేష్, నాగేందర్, లక్ష్మీ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.